వలంటీర్ల సేవలు అభినందనీయం



జుజ్జూరులో వలంటీర్‌కు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, జెడ్పీటీసీ అమర్లపూడి కీర్తిసాజన్య, ఎంపీపీ కోటేరు లక్ష్మి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్‌బేగం

జుజ్జూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న నవరత్నాల పథకాలు–పాలనా సంస్కరణలను ప్రజలకు చేరువ చేయడంలో వలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. మండలంలోని జుజ్జూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం వలంటీర్‌కు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ వివక్ష, లంచాలకు తావులేకుండా వలంటీర్లు ప్రభుత్వ పథకాలను త్రికరణశుద్ధిగా ప్రజలకు అందిస్తున్నారన్నారు. జన్మభూమి కమిటీలు గత ప్రభుత్వ పతనానికి కారణమైతే, వలంటీర్లు తమ అత్యుత్తమ సేవల ద్వారా సీఎం జగనన్న జైత్రయాత్రను సుగమం చేసే సైనికులని పేర్కొన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలన ప్రజల ఇళ్లముంగిటకే చేరిందని కొనియాడారు. ప్రతి పౌరసేవను ప్రజల ఇళ్ల వద్దనే అందిస్తున్నామంటే అది వలంటీర్ వ్యవస్థ ద్వారానే సాధ్యమైందని గుర్తుచేశారు. వలంటీర్లు రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి ప్రజలకు మేలు చేయడంతోపాటు ప్రభుత్వానికి మరింత మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసాజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచి రమావత్ కోటి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, ఎంపీడీవో శివపార్వతి, నాయకులు నువ్వుల విశ్వనాథం, మారపాక మహాలక్ష్మి, జమ్ముల వరబాబు, జయాలుద్దీన్, మండలంలోని వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గ్రామ స్వరాజ్యం



మోగులూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

మోగులూరు(కంచికచర్ల) : గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమైందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని మోగులూరులో సోమవారం ఆయన 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. యోగక్షేమాలతోపాటు వారి ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుతీరును ఆరా తీశారు. ప్రభుత్వ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో ప్రభుత్వ పథకాలు అందాలంటే మండల కేంద్రాల చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేసిన ఫలితం దక్కక ప్రజలు ఇబ్బందిపడ్డారన్నారు. కాని నేడు అర్హత ఉంటే ఇంటిముంగిటనే వలంటీర్ ఆయా పథకాలను అందిస్తున్న వైనాన్ని గమనించాలని ప్రజలను కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు ఆశీర్వదిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, సర్పంచి షేక్ మొహిద్దీన్‌బీ, ఎంపీటీసీ సభ్యులు ఆవల సామ్రాజ్యం, గ్రామపార్టీ కన్వీనర్ బండి సూరిబాబు, మాజీ సర్పంచి షేక్ హుస్సేన్, బండి తిరుపతిరావు, రాయల నరహరి, షేక్ రసూల్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వో శ్రీలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



వత్సవాయి : మండల కేంద్రం వత్సవాయిలోని జెడ్పీ హైస్కూల్ సెంటర్ నుంచి కేడీసీసీ బ్యాంకు వరకు డీఎంఎస్ నిధులు రూ.1.90కోట్లతో చేపట్టిన తారురోడ్డు, సైడ్‌కాల్వల నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యులు యేశపోగు దేవమణిశ్రీనివాస్, ఎంపీపీ కొలుసు రమాదేవి, సర్పంచి భూక్యా సీతమ్మ సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామస్తుల వినతి మేరకు జగ్గయ్యపేట ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభాను నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, చిరుమామిళ్ల ప్రభాకరరావు, బత్తుల జానకీరాములు, భూక్యా రాజానాయక్, కార్యదర్శి షేక్ ఇమామ్‌సాహెబ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన..

వత్సవాయి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని జెడ్పీటీసీ సభ్యులు యేశపోగు దేవమణిశ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. పరిశుభ్రమైన వాతావరణంలో వంట తయారుచేయాలని నిర్వాహకులకు సూచించారు. ఎంపీపీ కొలుసు రమాదేవి, సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఎంఈవో ఎల్. నాగరాజు పాల్గొన్నారు.

సీఎస్ఐ మిషనరీ ద్వారా మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న బిషప్ జార్జి కొర్నేలియస్, పక్కన డి.జాషువా కుమారి, జర్మనీ ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: సీఎస్ఐ(చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా)సంస్థ మిషనరీ ఆస్పత్రి అందిస్తున్న వైద్యసేవలను జగ్గయ్యపేట పట్టణంతోపాటు పరిసరప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీఎస్ఐ కృష్ణా, గోదావరి అధ్యక్ష ఖండం పీఠాధిపతి(బిషప్) రైట్ రెవ డాక్టర్ టి.జార్జికొర్నేలియస్ కోరారు. పేటలోని విజయవాడ రోడ్ వైఎస్ సర్కిల్ వద్ద ఉన్న సీఎస్ఐ కాంపౌండ్‌లో నూతనంగా నిర్మించిన సీఎస్ఐ మిషనరీ హాస్పిటల్‌ను ఈఎంఎస్ సంస్థ(జర్మనీ) ప్రెసిడెంట్ రెవ డెట్‌లెవ్ నాక్, ఈఎంఎస్ ఇండియా అండ్ ఈస్ట్ ఆసియా లైజన్ సెక్రటరీ సొలోమన్ బెంజమెన్‌తో కలసి సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో బిషప్ మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో ప్రస్తుతం న్యూరాలజిస్ట్, గైనకాలజిస్ట్ వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు. ఆస్పత్రి అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో ఇక్కడ ఆధునిక ఎక్విప్‌మెంట్స్, సాంకేతిక పరిజ్ఞానంతో అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తామన్నారు. ఆస్పత్రి నిర్మాణంలో స్థానిక ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. జర్మనీ సంస్థ ప్రతినిధులు రెవ డెట్‌లెవ్ నాక్, సొలోమన్ బెంజమెన్ మాట్లాడుతూ సీఎస్ఐ సంస్థ ఆలోచనలతో కలసి పనిచేస్తున్నామన్నారు. ఈ మిషనరీ ఆస్పత్రికి తమ సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు వివరించారు. కృష్ణా గోదావరి డయోసిస్ ఉమెన్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవ డి.జాషువా కుమారి, డయోసిస్ సెక్రటరీ టి.రవికుమార్, అసిస్టెంట్ సెక్రటరీ డి. సుధాకర్, ట్రెజరర్ అలెగ్జాండర్, ప్రాపర్టీ సెక్రటరీ సుధీర్‌దత్, పాస్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈనెల 22న హుండీ లెక్కింపు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ హుండీ లెక్కింపును ఈనెల 22న చేపడుతున్నట్లు ఆలయ ఏసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు సోమవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం తొమ్మిది గంటలకు దేవాదాయశాఖ, పాలకవర్గ సభ్యుల సమక్షంలో జరిగే ఈ హుండీ లెక్కింపులో ఆసక్తి కలిగినవారు పాల్గొనాలని కోరారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

జగ్గయ్యపేట: రహదారి భద్రతపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని ప్రాంతీయ రవాణా శాఖాధికారి రవికుమార్ సూచించారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక వివాన్, సిటీ సెంట్రల్, వేగు, నారాయణ, చైతన్య పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం ఆయన రహదారి భద్రత కోసం పాటించాల్సిన సూచనలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆర్టీవో కార్యాలయ సిబ్బంది ఆలాం, విజయభాస్కర్ పాల్గొన్నారు.

కల్యాణోత్సవాలు ప్రారంభం



నందిగామ: స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న శ్రీశుకశ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పది రోజులపాటు కొనసాగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు స్వామివారిని పెండ్లికుమారునిగా, అమ్మవారిని బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.రాత్రి సమయంలో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

నాణ్యమైన విద్యను అందించాలి



పెనుగంచిప్రోలు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో డి.రవీంద్ర, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కె. జలజ సూచించారు. స్థానిక కెబీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం మండలంలోని ప్రైమరీ, సెకండరీ స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా గుణాత్మక విద్యను కొనసాగిస్తూ కృత్యాధార, క్రీడా పద్ధతి, ప్రాజెక్టు, అన్వేషణ పద్ధతులను బోధనలో అమలు చేయాలని సూచించారు. యోగా గురువు కె.అశ్విని మాట్లాడుతూ ధ్యానం, యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం అశ్వినిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. రిసోర్స్‌పర్సన్లు పాము నాగేశ్వరరావు, దోనపాటి నాగేశ్వరరావు, పైదా దానయ్య పాల్గొన్నారు.

పలు నిర్మాణాలకు భూమిపూజ



పెనుగంచిప్రోలు:గ్రామంలోని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు గురు విశ్వస్ఫూర్తి సమాధి ప్రాంగణం స్ఫూర్తి యూనివర్స్ వద్ద పలు నిర్మాణాలకు సోమవారం భూమిపూజ చేశారు. స్ఫూర్తి కుటుంబం గ్లోబల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

కంచికచర్ల : ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను మరోసారి తెలుసుకోవడంతోపాటు వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సూచించారు. కంచికచర్ల సచివాలయం-3 పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, వలంటీర్లతో సోమవారం రాత్రి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహంతోపాటు జ్యోతీరావ్ పూలే, బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అంబేడ్కర్ కాలనీలో అంబేడ్కర్ భవన్‌కు మరమ్మతులు, కాలనీలో కల్వర్టు పనులు, అవసరమైన చోట గ్రావెల్‌తో లెవలింగ్ పనులు చేపడతామని వివరించారు. సమావేశంలో సర్పంచి వేల్పుల సునీత, ఉపసర్పంచి వేమా సురేష్‌బాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదుగుల శంకర్, నాయకులు దేవరకొండ గురవయ్య, వేల్పుల శ్రీనివాసరావు, ఎం. పాండు, మేడిద బాబు, శేషం మధుబాబు, దాయల నరసింహారావు పాల్గొన్నారు.

అమ్మవారికి మొక్కులు చెల్లింపు



లింగగూడెంలో అమ్మవారి పల్లకీలు

లింగగూడెం(పెనుగంచిప్రోలు): రంగుల ఉత్సవం పూర్తి చేసుకొని శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ అమ్మవారుతోపాటు సహదేవతల విగ్రహాలు సోమవారం సాయంత్రానికి మండలంలోని లింగగూడెం గ్రామానికి చేరుకున్నాయి. మహిళలు అమ్మవార్లకు ఎదురేగి వార్లుపోసి కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చారు. అమ్మవార్లను నిలిపిన స్థలం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పల్లకీల వెంట వచ్చిన వారికి గ్రామస్తులు భోజనవసతి ఏర్పాటు చేశారు. పల్లకీల రాకతో లింగగూడెంలో పండుగ వాతావరణం నెలకొంది. బంధువులు, స్నేహితులతో ఇళ్లన్నీ కళకళలాడాయి. కార్యక్రమంలో సర్పంచి బరిగెల మంగమ్మ, పెనుగంచిప్రోలు ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో కె.రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యులు వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షుడు బరిగెల నాగరాజు, ఉపసర్పంచి బి.వెంకటరెడ్డి, నాయకులు ఏనుగుల ధర్మారెడ్డి, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు

వీఅన్నవరం(వీరులపాడు): మండలంలోని వీఅన్నవరంలో వేంచేసియున్న ఆంజనేయస్వామి వారి జీవధ్వజ పునః ప్రతిష్టా కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాల్లో భాగంగా సోమవారం గణపతిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠించనున్న జీవధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ వల్లాపురి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 22న ఉదయం 11.47 గంటలకు ధ్వజస్తంభాన్ని పునఃప్రతిష్ఠించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి జమ్ముల వరబాబు, మాజీ సర్పంచి శేషగిరిరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచి మనసును చాటుకున్న ఎమ్మెల్సీ



ఆస్పత్రిలో రోగి వివరాలను ఆరా తీస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

నందిగామ టౌన్: ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ దగ్గరుండి మరీ ఓ రోగికి మెరుగైన చికిత్స అందేలా పర్యవేక్షించి తన మంచి మనసును మరోసారి చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే కంచికచర్ల మండలానికి చెందిన పార్టీ నాయకుడి బంధువులకు రోడ్డుప్రమాదం జరిగిందని తెలుసుకున్న ఎమ్మెల్సీ అరుణకుమార్ సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ మృతదేహాన్ని పరిశీలించి, ప్రమాద వివరాలు తెలుసుకుంటుండగా పక్కబెడ్‌పై ఉన్న మరొకవ్యక్తిని చూసి అతని గురించి ఆరా తీశారు. అతని వివరాలు తమకు తెలియదని, నందిగామ పాతబస్టాండ్ సమీపంలో స్పృహ తప్పి ఉండటంతో 108అంబులెన్స్ సిబ్బంది తీసుకువచ్చారని వైద్యులు తెలిపారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడని మెరుగైన వైద్యనిమిత్తం విజయవాడ తరలించాల్సి ఉందని వివరించారు. దీంతో చలించిపోయిన ఎమ్మెల్సీ అరుణకుమార్ వెంటనే స్పందించి అతని వద్ద నున్న సెల్‌ఫోన్ తీసుకుని అందులో రీసెంట్ ఫోన్ హిస్టరీలోని నంబర్ల ద్వారా అతని కుటుంబసభ్యులను సంప్రదించి అతను కంచికచర్ల మండలం కీసర గ్రామానికి చెందిన ఆటోసాయిగా గుర్తించారు. ఆటోసాయి ఆస్పత్రిలో ఉన్న విషయాన్ని వారి తెలియజేసి, అతని కుటుంబసభ్యులు వచ్చేంత వరకు ఎమ్మెల్సీ అరుణకుమార్ ఆస్పత్రిలోనే వేచి ఉన్నారు. ఆటోసాయి కుటుంబసభ్యులు రాగానే వారికి కొంత నగదును ఆర్థికసాయం అందించి మెరుగైన వైద్యం కోసం ఆటోసాయిని మరో అంబులెన్స్‌లో దగ్గరుండి విజయవాడ పంపించారు. రోగి విషయంలో ఎమ్మెల్సీ అరుణకుమార్ స్పందించిన తీరును చూసి ఆస్పత్రి సిబ్బంది, వైద్యం కోసం వచ్చిన స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బద్దూనాయక్ నియామకంపై హర్షం



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన లాహోరి బద్దూనాయక్ నియమితులైన సందర్భంగా పలు గ్రామాలకు చెందిన సుగాలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పేట మండలంలోని ముక్త్యాల గ్రామానికి చెందిన సుగాలీలు, నియోజకవర్గానికి చెందిన బంజారా ఉద్యోగ సంఘం నాయకులు సోమవారం లాహోరి బద్దూనాయక్‌ను తన నివాసంలో కలిసి అభినందనలు తెలియజేశారు.

ఎమ్మెల్సీ అరుణకుమార్‌కు సత్కారం



ఎమ్మెల్సీ అరుణకుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్యదర్శులు

నందిగామ టౌన్: పంచాయతీకి ప్రత్యేక కార్యదర్శిని నియమించడం ద్వారా గ్రామస్థాయి పరిపాలన సులభతరమవుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం జీవోనంబరు 11ను జారీచేయడంపై హర్షం వ్యక్తంచేస్తూ నందిగామ, చందర్లపాడు మండల కార్యదర్శులు ఎమ్మెల్సీ అరుణకుమార్‌ను సోమవారం స్థానిక కార్యాలయంలో కలిసి సత్కరించారు. గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలు కల్పించేలా కృషిచేశారంటూ ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ ప్రజలకు సులభతరమైన పాలన అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చీ రాగానే సచివాలయ వ్యవస్థను రూపొందించి లక్షల సంఖ్యలో ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. సచివాలయ ఉద్యోగులు తమవనితీరుతో ప్రభుత్వానికి మరింత మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.1.50కోట్లతో పైప్‌లైన్ పనులు



చందర్లపాడు(నందిగామ టౌన్): జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటికి ఇంటింటికీ అందించేందుకు కృషి చేస్తున్నట్లు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలం పొక్కునూరులో జలజీవన్ మిషన్ పథకం కింద చేపడుతున్న ఇంటింటికీ కుళాయి, పైప్‌లైన్ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రతివ్యక్తికి సగటున రోజుకు 55 లీటర్ల సురక్షితమైన తాగునీటిని అందించేలా రూ.1.50కోట్లతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులు చేపడుతున్నట్లు వివరించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించాడు. పనులు నాణ్యతతో సాగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, నాయకులు కొమ్మినేని మహేంద్ర, వైఎస్ఎన్ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ గండ్రాయి

- రూ.7.40కోట్లతో అభివృద్ధి పనులు
- మెరుగుపడిన మౌలిక వసతులు
- హర్షం వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు



గండ్రాయిలోని సచివాలయం



రూ.2కోట్లతో అభివృద్ధి చేసిన గండ్రాయి-షేరమహ్మద్‌పేట రోడ్డు

ఇది కదా అభివృద్ధి



జగనన్న కాలనీలోని నిర్మించుకున్న ఇళ్లు



గండ్రాయిలోని పాఠశాల

గండ్రాయి(జగ్గయ్యపేట): మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న జగ్గయ్యపేట మండలంలోని గండ్రాయి గ్రామం అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది. గ్రామంలో 2263 కుటుంబాలు నివసిస్తుండగా, 6,570 మంది జనాభా ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల తొమ్మిది నెలల పాలనలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కృషితో మునుపెన్నడూ లేనివిధంగా గ్రామానికి కోట్లాది రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఆయా నిధులతో గ్రామంలో మౌలికవసతులు మెరుగుపరిచారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేశారు. రోడ్డు వసతి కల్పించారు.

మారిన పాఠశాలల రూపురేఖలు..

నాడు–నేడు పథకం కింద మొదటి ఫేజ్‌లో గండ్రాయిలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలకు రూ.74.18లక్షలు కేటాయించారు. ఈ నిధులతో అదనపు తరగతి గదులు, విద్యార్థులకు బల్లలు, మంచినీరు, మరుగుదొడ్ల వసతితోపాటు కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా అన్నిరకాల వసతుల కల్పించి అభివృద్ధి చేశారు. దీంతో పాఠశాలల స్వరూపం పూర్తిగా మారిపోయింది. విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పిస్తుండటంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తుండటంతో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.

రూ.1.44కోట్లతో తరగతి గదులు..

నాడు–నేడు పథకం రెండో ఫేజ్ కింద గండ్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.1.44కోట్లతో 12 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అన్నిరకాల మౌలికవసతులు ఏర్పాటు చేశారు.

రూ.60లక్షలతో అంగన్‌వాడీ కేంద్రాలు

గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు ఒక్కో కేంద్రానికి రూ.20లక్షల చొప్పున మొత్తం రూ.60లక్షలు మంజూరు చేశారు. ఈనిధులతో చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పనులు తుదిదశలో ఉన్నాయి.

రూ.80లక్షలతో సచివాలయాలు..

గ్రామంలో రూ.80లక్షలతో రెండు సచివాలయాలను నిర్మించారు. రూ.43.60లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.35లక్షలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్, రూ.9లక్షలతో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు.

రూ.3కోట్లతో రోడ్ల నిర్మాణం..

గ్రామం నుంచి దేచుపాలెం వెళ్లేందుకు సరైన రోడ్డు వసతి లేక గ్రామస్తులు కొన్నేళ్లుగా తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈసమస్యను ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దృష్టికి తీసుకువెళ్లడంతో జిల్లా మైనింగ్ నిధులు రూ.కోటితో రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. అదేవిధంగా గండ్రాయి నుంచి షేర్‌మహ్మద్‌పేటకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును కూడా రూ.2కోట్లతో అభివృద్ధి చేశారు.అదేవిధంగా జగనన్న కాలనీలో 188మందికి ఇళ్లస్థలాలతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేశారు. లబ్ధిదారుల ఇళ్లనిర్మాణాలు పూర్తికావస్తున్నాయి. ఇలా గండ్రాయి గ్రామానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నిరకాల మౌలికవసతులు సమకూరాయంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఇళ్ల ముంగిటకే పథకాలు



సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటిముంగిటనే ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారు. ప్రభుత్వం అందించే సాయంతో మేము ఎంతో సంతోషంగా ఉన్నాం. ఇటువంటి మంచి ప్రభుత్వం ఎప్పటికీ ఉండాలి.

– సంపత నగ్మా, గ్రామస్తురాలు

డీబీటీ ద్వారా రూ.12.94కోట్ల లబ్ధి



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఆయా పథకాల ద్వారా గండ్రాయి వాసులకు ఇప్పటివరకు డీబీటీ రూపంలో 12.94కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సహకారంతో గ్రామంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టాం.

– కొత్తపల్లి లూర్దుమేరి, సర్పంచి

పేదల కోసమే రాజన్న ఉచిత భోజనం



జగ్గయ్యపేట అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల స్ఫూర్తితో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆధ్వర్యంలో నిరుపేదలు, నిరాశ్రయులు, అభాగ్యుల కోసం స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద నిరంతరం కొనసాగేలా రాజన్న ఉచిత భోజనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు అకుల శ్రీకాంత్ తెలిపారు. రాజన్న ఉచిత భోజన కార్యక్రమం సోమవారానికి 200వ రోజుకు చేరింది. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ 200వరోజు సందర్భంగా స్వీట్లు, హాట్‌తో ప్రత్యేక భోజనాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొత్తం 1500 మందికి పైగా పాల్గొని ఉచిత భోజనాలు చేసినట్లు తెలిపారు. పేదల కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే, ఆ కుటుంబసభ్యుల అభ్యర్థన మేరకు 100 నుంచి 200మందికి వారి ఇంటికే క్యారేజీ పంపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాజన్న ఉచిత భోజనం క్యాంటీన్ నిర్వాహకులు జీపీడీ ప్రసాద్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి అంజనీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.